క్లుప్తంగా

ఉద్యాన పంటల పరిశీలన



పమిడిముక్కల: మండలంలో ఉద్యాన పంటల నష్టం నమోదుకు చర్యలు తీసుకొంటున్నట్లు మండల వ్యవసాయాధికారి గణేష్, ఉద్యాన అధికారి నాగదేవి తెలిపారు. మండలంలోని అగినపర్రు, మామిళ్లపల్లి, పమిడిముక్కల, పైడికొండలపాలెంలో పర్యటించి దెబ్బతిన్న అరటి, కూరగాయల, వరి పంటలను గురువారం పరిశీలించారు. రైతులను వివరాలు అడిగి తెలుసుకొన్నారు. వరి, ఉద్యాన పంటల నష్టం అంచనా వేయడానికి గ్రామాల్లో పర్యటించినట్లు గణేష్, నాగదేవి తెలిపారు.

ఓటు వేసే విధానంపై అవగాహన



మొవ్వ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీల నేతల సమక్షంలో ఈవీఎం ద్వారా ఓటు వేసే విధానంపై గురువారం తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్ అవగాహన కల్పించారు. అయ్యంకి, భట్లపెనుమర్రు, పెదసనగల్లు, కూచిపూడి, చినముత్తేవి, మంత్రిపాలెం, నిడుమోలు, మాకులవారిపాలెం గ్రామాల్లో డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్ గోపాలరావు, ఆయా గ్రామాల వీఆర్వోలు, వీఆర్ఏల సహకారంతో ఈవీఎంతో ఓటు వేసే విధానాన్ని ఓటర్లకు వివరించారు.

ఎయిడ్స్‌పై అప్రమత్తం

తోట్లవల్లూరు: ఎయిడ్స్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం జోనల్ సూపర్‌వైజర్ సుందరరావు సూచించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యాన మండలంలోని రొయ్యూరు గ్రామ సచివాలయంలో గురువారం ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన జరిగింది. సర్పంచ్ నిమ్మగడ్డ ప్రభుదాస్, సచివాలయ కార్యదర్శి చైతన్య, ఏఎన్ఎం విజయ, తదితరులు పాల్గొన్నారు.

బడ్డీకొట్టు అందజేత



పమిడిముక్కల: చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సహకారం అందిస్తున్నారు. దీనిలో భాగంగా కృష్ణాపురం శివారు ఎస్సీ కాలనీకి చెందిన జె.వెంకటరత్నంకు బడ్డీకొట్టును అందజేశారు. దీన్ని గురువారం మండల పార్టీ అధ్యక్షుడు యలమంచిలి గణేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు గంజాల సీతారామయ్య, కొడమంచిలి మహేష్, పార్టీ నాయకులు వీరంకి చిరంజీవి, బాజీ, శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం



ముదినేపల్లిరూరల్: మానవాళికి ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) చెప్పారు. ముదినేపల్లి వైఎస్సార్ కాలనీలో ఐక్య గ్రాండ్ క్రిస్మస్ వేడుక గురువారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే డీఎన్నార్ క్రిస్మస్ కేక్ కట్ చేశారు. మచిలీపట్నంకు చెందిన డాక్టర్ ఎ.ఫిన్ని సామ్యూల్ దేవుని ప్రేమ సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఘంటా సంధ్య, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మోట్రూ ఏసుబాబు, పాస్టర్ జాషువా జ్యోతి, అబ్రహం, పలువురు స్థానికులు పాల్గొన్నారు.

చెంతనే సేవలు

- నందివాడ మండలంలో పూర్తవుతున్న ప్రభుత్వ భవనాల నిర్మాణం
- సత్ఫలితాలనిస్తున్న సేవలు
- 24 గ్రామాల్లో 12 ఆర్‌బీకేలు, 12 సచివాలయాలు, 5 పీహెచ్‌సీల నిర్మాణం



లక్ష్మీనరసింహపురంలో పూర్తయిన సచివాలయం

గుడివాడ టౌన్(నందివాడ): సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాల సేవలు చెంతనే ఉండటంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పేదలకు మెరుగైన సేవల కోసం కిలోమీటర్ల దూరం వెళ్లకుండా చెంతనే అందేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. దీనిలో భాగమే.. సచివాలయాలు, ఆర్బీకేలు, ఆరోగ్య కేంద్రాలు. వీటి సేవలు విస్తృతం కావడంతో సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సొంత భవనాల నిర్మాణానికి చేస్తున్న ఏర్పాట్లు నందివాడ మండలంలో పూర్తి కావస్తున్నాయి.

24 గ్రామాల్లో..

మండలంలోని 24 గ్రామాలకు సంబంధించి 12 రైతుభరోసా కేంద్రాలు, 12 సచివాలయాలు, 5 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది. ఇందులో నందివాడ, పుట్టగుంట, తుమ్మలపల్లి, కుదరవల్లి, ఇలపర్రు(లక్ష్మీనరసింహపురం) లలో రూ 43.6 లక్షల అంచనాత నిర్మించిన సచివాలయాలు కొన్ని ప్రారంభమయ్యాయి. మరికొన్ని నిర్మాణం పూర్తై ప్రారంభోత్సవాలకు సిద్ధంగా ఉన్నాయి. మరో మూడు సచివాలయ భవనాల నిర్మాణం పూర్తి కాగా వసతులు, ఇతర సౌకర్యాలు అందుబాటులోకి రావాల్సి ఉంది. ఇవి పూర్తయితే మండలంలోప్రభుత్వం నిర్దేశించిన మేరకు అన్ని సచివాలయాలు సొంత భవనాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తాయి.



ప్రారంభానికి సిద్ధంగా రైతు భరోసాకేంద్రం



తుమ్మలపల్లిలో హెల్త్‌క్లినిక్

రూ.23.94 లక్షలతో..

ఇక రైతుభరోసా కేంద్రాల విషయంలో ఒక్కొక్క కేంద్రానికి రూ.23.94 లక్షల అంచనాతో నిర్మాణ పనులు చేపట్టారు. లక్ష్మీనరసింహపురం, పెదలింగాల, తుమ్మలపల్లి, కుదరవల్లి గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు పూర్తయ్యాయి. మిగిలిన ప్రాంతాల్లో 90 శాతం పైగా పూర్తయ్యాయి. వీటిని సాధ్యమైనంత త్వరలో ప్రారంభోత్సవాలు చేస్తామని అధికారులు అంటున్నారు.

మరో ఐదు ఆరోగ్యకేంద్రాలు

మండలంలో ఇప్పటికే రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పనిచేస్తుంటే కొత్తగా మరో ఐదు ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. తుమ్మలపల్లి, తమిరిశ, పుట్టగుంట, కుదరవల్లి, ఇలపర్రులలో రూ 20.3 లక్షలతో వీటిని నిర్మిస్తున్నారు. ఇప్పటికే తుమ్మలపల్లి తదితర గ్రామాల్లో ఆరోగ్య కేంద్రాల నిర్మాణం పూర్తిచేసి వినియోగంలోకి రాగా మిగిలినవి 90 శాతం పూర్తై ముగింపు దశకు చేరుకున్నాయి. వీటి పనులు త్వరలో పూర్తిచేస్తామని అధికారులు అంటున్నారు.

త్వరలో అన్ని పూర్తిచేస్తాం



ప్రభుత్వ లక్ష్యం మేరకు మండలంలో 12 గ్రామ సచివాలయ భవనాలు, 12 రైతు భరోసా కేంద్రాలు, 5 ఆరోగ్య కేంద్రాలు నిర్మాణాలు చేపట్టాం. దాదాపు సగానికి పైగా నిర్మాణాలు పూర్తయి అందుబాటులోకి వచ్చాయి. కొన్ని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. కొన్ని పూర్తిగా తయారయ్యాయి. మిగిలిన కొన్ని కేంద్రాలు పూర్తయితే ప్రజాప్రతినిధుల నిర్ణయం మేరకు ప్రారంభోత్సవాలు చేస్తాం.

–వీఎస్ నాగేశ్వరరావు,
ఎంపీడీఓ, నందివాడ

చాలా వెసులుబాటుగా ఉంది



మా గ్రామానికి నందివాడ మండల కేంద్రం 14 కిలోమీటర్లు. ఏచిన్న పనిఉన్నా అన్ని కిలోమీటర్లు వెళ్లి పనిచేసుకోవలసి వచ్చేది. ఒకవేళ పనులు కాకపోతే పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు మా గ్రామంలోనే సచివాలయం, రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేశారు. మా పరిసర గ్రామాలకు సైతం రెండు కిలోమీటర్ల పరిధిలో ఇవి పనిచేస్తున్నాయి. ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది.

–చింతాడ మాణిక్యాలరావు,
లక్ష్మీనరసింహపురం

భోగేశ్వరస్వామి ప్రాకార మండప పనులు ప్రారంభం



కలిదిండి: పాతాళ భోగేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న ప్రాకార మండప పనులను శరవేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. భోగేశ్వర స్వామి నూతన ప్రాకార మండప పనులను ఎమ్మెల్యే గురువారం పరిశీలించి, ఐరన్ పనులకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, గుర్వాయిపాలెం సర్పంచ్ బత్తిన ఉమామహేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు వడుపు రామారావు, పాము రవికుమార్, మసీముక్కల వెంకటేశ్వరరావు, మంగినేని భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

పామర్రులో.. నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పామర్రు: పట్టణంలో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని పామర్రు వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు గురువారం విలేకరులకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలోని సచివాలయం–5 పరిధిలోని 19, 20 వార్డుల్లో కార్యక్రమం జరుగుతుందని పామర్రు ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పాల్గొంటారని పేర్కొన్నారు.

జగనన్న పాలనపైనే ప్రజలకు మక్కువ

ఎమ్మెల్యే డీఎన్నార్

కలిదిండి: రాష్ట్రంలో పార్టీలకతీతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ప్రజలు జగనన్న పాలనపైనే మక్కువ చూపుతున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) పేర్కొన్నారు. మండలంలోని తాడినాడ గ్రామ సచివాలయం పరిధిలో గురువారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వార్డు, పంచాయతీల్లో చేసిన అభివృద్ధి, మంజూరు చేసిన నిధులను ప్రజలకు వివరించారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అభివృద్ధి పనులతో జగనన్న చారిత్రాత్మక పాలన చేస్తూ, దేశంలోని అన్ని రాష్ట్రాలు ఏపీ వైపు చూసేలా చేస్తున్నారన్నారు. గ్రామ సచివాలయం పరిధిలో 21.23 కోట్లతో సంక్షేమ పథకాలను అందించి, అభివృద్ధి చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. మళ్లీ జగన్‌ను మీరంతా ఆశీర్వదించాలని కోరారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి, పార్టీ జెండాను ఎగురవేశారు. ఇంటింట ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, వైస్ ఎంపీపీలు కూసంపూడి కనక దుర్గారాణి, కట్టా నాగలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమాని రమేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు సాగి చిన్నబ్బాయి రాజు, పెన్మత్స కృష్ణంరాజు, సర్పంచ్‌లు మసిముక్కల మారుతీ ప్రసన్న, ద్రోణాద్రి నాగలక్ష్మి, మహదేవ్ విజయబాబు, ఎంపీటీసీలు ఇమ్మానేని లక్ష్మణరావు, రావాడి బాలు, సీనియర్ నాయకులు పామర్తి సత్యనారాయణ, పాము రవికుమార్, ముద్దం గాంధీ, మసిముక్కల వెంకటేశ్వరరావు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఇంటింట ప్రచార నిర్వహించి, సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ప్రారంభానికి ముస్తాబవుతున్న కైకాల విగ్రహం



గుడివాడ టౌన్: సినీ నటుడు, బందరు మాజీ ఎంపీ కైకాల సత్యనారాయణ కాంస్య విగ్రహం ప్రారంభానికి స్థానికంగా ముస్తాబు చేస్తున్నారు. ఇప్పటికే విగ్రహాన్ని ఏర్పాటు చేసి తుది మెరుగులు దిద్దుతున్నారు. ఈనెల 23న బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయనున్నారు. కళాకారుల పుట్టినిల్లు అయిన పట్టణానికి చెందిన కైకాల విగ్రహాన్ని ఏర్పాటు చెయ్యడంపై కళాకారుల సంఘాలు, కాపు నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణ స్థలం కోసం వినతి

కైకలూరు: కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని రూరల్ మెడికల్ ప్రాక్టిషనర్స్ వెల్ఫేర్ అసోషియేషన్(ఆర్ఎంపీడబ్ల్యూఏ) కైకలూరు, మండవల్లి ఏరియా సంఘ సభ్యులు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్)కు ఆయన ఇంటి వద్ద వినతిపత్రాన్ని గురువారం అందించారు. సంఘ అధ్యక్షుడు ఎం.విజయ్‌కుమార్ మాట్లాడుతూ సంఘ సమావేశాల నిర్వహణకు అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. కై కలూరు జగనన్న గ్రీన్ విలేజ్‌లో కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేను కోరామన్నారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందిచారని చెప్పారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి ఎల్.రవికుమార్, కోశాధికారి జనర్ధనరావు, ఉపాధ్యక్షుడు గణేష్, గౌరవాధ్యక్షులు శేషుబాబు, ఆర్ఎంపీలు పాల్గొన్నారు.

గుడివాడలో.. జగనన్నే ఎందుకు కావాలి



పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

గుడివాడ టౌన్: ఏపీకి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన మళ్లీ ఎందుకు కావాలి అనే అంశంపై నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా స్థానిక 14వ వార్డు సచివాలయం వద్ద అవగాహన కల్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడుతూ మాట్లాడుతూ వార్డుకు చెందిన 3,054 మంది లబ్ధిదారులకు ప్రత్యక్షంగా రూ.9,46, 31,783.. 1,426 మంది లబ్ధిదారులకు పరోక్షంగా రూ 4,39,15,433, మొత్తం రూ.13,85,47, 216 లబ్ధి చేకూరినట్లు వారు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ జ్యోతుల సత్యవేణి, వైఎస్సార్ సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మలిరెడ్డి రవి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రేమల్లి నీలాకాంత్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్‌బాజీ, తదితరులు పాల్గొన్నారు.

పెరికెగూడెంలో డ్రెయినేజీ పనులు



మండవల్లి: మండలంలోని పెరికెగూడెంలో సర్పంచ్ పెరుమాళ్ల పద్మ పర్యవేక్షణలో స్కూల్ నుంచి ముసలమ్మతల్లి ఆలయం వరకు డ్రెయినేజీ పనులు గురువారం ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు కింద ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) రూ.6 లక్షలు మంజూరు చేయించడంతో పనులు ప్రారంభించినట్లు సర్పంచ్ పేర్కొన్నారు. గతంలో నిలుపు చేసిన పనుల వద్ద నుంచి ప్రారంభించినట్లు సర్పంచ్ తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పెరుమాళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

రక్తదానంపై అపోహలు వీడండి



కైకలూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

కైకలూరు: రక్తదానంపై ప్రజలు అపోహలు వీడాలని కై కలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రఘునాథరెడ్డి చెప్పారు. కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్, రెడ్ రిబ్బన్ క్లబ్, యూత్ రెడ్ క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరాన్ని కాలేజీలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రక్తదానం చేస్తే మరొకరి ప్రాణాలను నిలబెట్టవచ్చని తెలిపారు. కాలేజీ ఆంగ్ల అధ్యాపకుడు పంకజ్‌కుమార్ ముందుగా రక్తదానం చేయడంతో విద్యార్థులు స్ఫూర్తి పొందారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.దుర్గాప్రసాద్ నిర్వహణలో గుడివాడ గవర్నమెంట్ ఏరియా హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ రక్తసేకరణ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు గీతాంజలి, ల్యాబ్ టెక్నిషియన్ షేక్ షరీఫ్, కాలేజీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎం.విజయ్‌కుమార్, యూత్ రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ ఎం.హరిప్రసాద్, రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ ఆర్.జాలబాబు, ఏలూరు హెచ్‌డీఎఫ్‌సీ మేనేజరు ఎ.సత్యనారాయణ, అధ్యాపకులు సంధ్య, ఇమ్మానియేలు, నున్న శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు విక్రయం



మండవల్లి పీఎస్ సమీపంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తున్న సిబ్బంది

మండవల్లి: స్థానిక పోలీసు స్టేషన్ సమీపంలో గురువారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను సిబ్బంది విక్రయించారు. వంగ, మునగ, పాలకూర, బొప్పాయి, తదితర కూరగాయలను విక్రయాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిన కూరగాయలు, ధాన్యం ఎంతో శ్రేష్ఠమైనవన్నారు. పురుగుమందులు వేయకుండా పండించిన కూరగాయలతో ఆరోగ్య సమస్యలు ఏర్పడవని, ఆరోగ్యం సక్రమంగా ఉంటుందని పేర్కొన్నారు. అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నియంత్రణపై అవగాహన

పామర్రు: మానవ అక్రమ రవాణా నియంత్రణపై అవగాహన కల్పిస్తున్నామని ప్రజ్వల సంస్థ సీనియర్ కో ఆర్డినేటర్ వై.చంద్రయ్య చెప్పారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, పామర్రు అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు మానవ అక్రమ రవాణాపై గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. చంద్రయ్య మాట్లాడుతూ ప్రజ్వల సంస్థ అధికారుల సహకారంతో ఇప్పటి వరకు 28వేల మంది అమ్మాయిలను మహిళను కాపాడి వారికి పునరావాసం కల్పించామన్నారు. నేటి యువత ఇంటర్నెట్, మొబైల్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్‌కి గురి అవుతున్నారన్నారు.

వారిని గమనిస్తూ అన్ని జిల్లాల్లో అంగన్‌వాడీ టీచర్‌లకు అవగాహన కల్పిస్తూ సమాజ జాగృతిసంఘాలను ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, అసిస్టెంట్ కో ఆర్డినేటర్లు శ్రావ్య, అనిల్‌కుమార్, ఆర్.కల్యాణ్ చక్రవర్తి, కె. రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం తనిఖీ

గూడూరు: గూడూరులోని భవిత కేంద్రాన్ని సమగ్ర శిక్ష ఏపీసీ కె.రాములు నాయక్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలోని రిజిస్టర్లను పరిశీలించి ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 47 ఐఈఆర్పీలను నూతనంగా నియమించామని చెప్పారు. ఒక్కో ఐఈఆర్పీ 20 మంది చిన్నారులకు తక్కువ కాకుండా పర్యవేక్షిస్తారన్నారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ కె.ఏడుకొండలు, ఐఈఆర్పీ రమాదేవి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యాచకురాలి మృతి

బంటుమిల్లి: అర్తమూరు గ్రామం వద్ద రోడ్డు ప్రమాదానికి గురై బందరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న యాచకురాలు గురువారం మృతి చెందిందని ఎస్ఐ ఎ. పైడిబాబు తెలిపారు. ఓ వృద్ధ మహిళ అర్తమూరు పరిసరాల్లో భిక్షాటన చేస్తూ జీవిస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 13వ తేదీ రాత్రి 216 జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఆమెను ఢీకొంది. గాయపడిన ఆమెను స్థానికులు 108 వాహనంలో బందరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు మృతి చెందింది. ఆమె వివరాలు తెలియలేదు. వీఆర్ఓ ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ మురళీకృష్ణ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు సెల్: 94407 96419కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక శ్రద్ధ

గూడూరు: తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు తడిసిన, రంగుమారిన ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని గూడూరు తహసీల్దార్ బి.విజయప్రసాద్ అన్నారు. తరకటూరుపాలెం రోడ్డులోని మిల్లులో ధాన్యం కొనుగోళ్లను గురువారం పరిశీలించారు.

కొనసాగుతున్న పంట నష్టం నమోదు ప్రక్రియ

వెంకటాపురం(మోపిదేవి): తుపానుకు దెబ్బతిన్న పంట నష్టం నమోదు ప్రక్రియ ఈనెల 18వ తేదీ వరకు కొనసాగుతుందని మండల వ్యవసాయాధికారి హెబ్సిబా రాణి అన్నారు. వెంకటాపురం, పెదకళ్లేపల్లి గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యోజన యాత్ర గ్రామ సభ గురువారం నిర్వహించారు. పెదకళ్లేపల్లి గ్రామ సభలో ఏఓ మాట్లాడుతూ ఈ క్రాప్ చేయించుకున్న ప్రతి రైతుకు పంట నష్టం నమోదు ప్రక్రియ ఈనెల 18వ తేదీ వరకు కొనసాగుతుందని, పంట దెబ్బతిన్న రైతులు తమ పొలం పత్రాలతో వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు. పీఎం కిసాన్ యోజన కింద నగదు పడని రైతులు ఆర్‌బీకేలలో వీఏఏలను సంప్రదించాలన్నారు. పంటపై పిచికారీ చేసే మందులకు స్ప్రే చేయడానికి డ్రోన్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం సబ్సిడీపై డ్రోన్‌లు అందస్తుందని, ప్రస్తుతం అద్దె రూపంలో కూడా అందుబాటులో దొరుకుతాయని చెప్పారు. చారు. ఈఓపీఆర్డీ అశోక్ కుమార్, వీఏఏలు, రెవెన్యూ అధికారులు, పలువురు రైతులు పాల్గొన్నారు.